వర్షాలతో పంటలకు తీవ్ర నష్టం
నేలకు ఒరిగిన పొలాలు.. కల్లాల్లో తడిసిన ధాన్యం
దెబ్బతిన్న పంటలను పరిశీలించిన కలెక్టర్
నష్టం అంచనాలు వేయాలని అధికారులకు ఆదేశం

# క'న్నీళ్లు' మిగిల్చిన మిగ్‌జాం


కూసుమంచి : మిర్చిని ఆరబెడుతున్న రైతులు


తిరుమలాయపాలెం : పొలాలను పరిశీలిస్తున్న ఏవో


ఉధృతంగా ప్రవహిస్తున్న మధిర మున్నేరు


ఎర్రుపాలెం : బనిగండ్లపాడు నుంచి తక్కెళ్లపాడు రాకపోకలు నిలిపివేసిన అధికారులు

కూసుమంచి, డిసెంబర్ 6: మిగ్‌జాం తుపాన్ రైతులను కన్నీళ్లు మిగిల్చింది. తుపాన్ తాకిడికి వరి, మిర్చి, మినుము పంటలు వేసిన రైతులు నష్టపోయారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు చేతికొచ్చిన పంటలు నీళ్ల పాలయ్యాయి. కళాల్లో ఆరబెట్టిన ధాన్యం తడవడంతో ఆరబెట్టే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. కూసుమంచి మండలం మల్లేపల్లిలో రైతుల పంటలు తడవడంతో తీవ్రంగా నష్టపోయారు. నష్టపోయిన పంటలకు పరిహారం ఇవ్వాలని రైతులు ప్రభుత్వాన్ని కోరారు.

మధిర, డిసెంబర్ 6: రెండు రోజులుగా తుపాన్ ప్రభావంతో మున్నేరు, వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పెనుగాలులు వీచడంతో పత్తి, మిర్చి, వరిపైర్లు నేలకొరిగి రైతులకు తీవ్ర నష్టాన్ని కలిగించాయి. కలెక్టర్ ఆదేశాల మేరకు వ్యవసాయాధికారులు పంటలను పరిశీలించి నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు తెలిపారు.

మధిర, డిసెంబర్ 6: పంటలను కాపాడుకోవాలని మధిర ఏడీఏ కొంగర వెంకటేశ్వర్లు సూచించారు. బుధవారం నియోజకవర్గంలోని పలు మండలాల్లో ఆయన తుఫాన్ ప్రభావానికి గురైన పత్తి, వరి, మిరప పైర్లను పరిశీలించారు. రైతులు దామిని యాప్‌ను డౌన్‌లౌడ్ చేసుకొని ముందుగానే వాతావరణ పరిస్థితులను తెలుసుకొని పంటలను కాపాడుకోవాలని తెలిపారు. ఏవోలు శ్రీనివాస్, సరిత, నాగయ్య, ఏఈవోలు ఉన్నారు.

చింతకాని, డిసెంబర్ 6 : మండల వ్యాప్తంగా 144.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు మండల వ్యవసాయశాఖ అధికారి పల్లెల నాగయ్య తెలిపారు. మండల పరిధిలోలో చాలా గ్రామాల్లో అప్పటికే నిండిన చెరువులు, వాగులు పొంగిపొర్లాయి. పైరు వర్షార్పణం కావడంతో రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలంటూ వేడుకుంటున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు తెలిపారు.

ఖమ్మం రూరల్, డిసెంబర్ 6: మండలంలో 71.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. 355 మంది రైతులకు సంబంధించి 630 ఎకరాల్లో వరి, 230 మంది రైతులకు సంబంధించి మిర్చి 340 ఎకరాలు, మొక్కజొన్న 15 ఎకరాల్లో నష్టం వాటిల్లిందని అధికారులు తేల్చారు.

తిరుమలాయపాలెం, డిసెంబర్ 6: మండలంలోని పలు గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను మండల వ్యవసాయాధికారి నారెడ్డి సీతారామరెడ్డి బుధవారం పరిశీలించారు. బచ్చోడు, సుబ్లేడు, మహ్మదాపురంలో వర్షానికి నేలవాలిన వరి పొలాలను పరిశీలించారు. మండలంలో 795 ఎకరాల్లో వరి పంట దెబ్బతిన్నట్లు వివరించారు.

ముదిగొండ, డిసెంబర్ 6: మండలంలో 67.8 మీ.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఈదురు గాలులకు వరి పంట నేలకొరిగింది. బుధవారం రాత్రి అతి భారీ వర్షం కురిసే అవకాశం ఉండడంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. మండల వ్యవసాయ అధికారి రాధ, ఏఈవోలు పొలాలు పరిశీలించి పంట నష్టం అంచనా వేస్తున్నారు.

కూసుమంచి, డిసెంబర్ 6: తుపాన్‌తో మిర్చి తోటలు దెబ్బతినకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఉద్యానవన అధికారి అపర్ణ రైతులను కోరారు. మండలంలోని చేగొమ్మ, ముత్యాలగూడెం, చింతల్‌తండా కేశ్వాపురం ప్రాంతాల్లోని మిర్చి తోటలను బుధవారం ఆమె పరిశీలించి సూచనలు చేశారు.

## పంట నష్టం నివేదికలు సమర్పించాలి


కొనుగోలు కేంద్రంలో మాట్లాడుతున్న కలెక్టర్

ఖమ్మం, డిసెంబర్ 12 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలను సర్వేచేసి నష్టం వివరాలు సమర్పించాలని ఖమ్మం కలెక్టర్ గౌతమ్ వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన కూసుమంచి మండలంలోని పొలాలను పరిశీలించారు. పాలేరులో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. వర్షాల వల్ల రైతులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని, సరిపడినన్ని టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. దెబ్బతిన్న పంటల గురించ సర్వే చేసి నివేదికలను సమర్పించాలని, ఏఈవోలు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని సూచించారు. అధికారులు విజయనిర్మల, విద్యాచందన, విజయకుమారి, శ్రీలత, రమాదేవి పాల్గొన్నారు.


మధిర రూరల్ : పంటను పరిశీలిస్తున్న క్లస్టర్ అధికారులు


బోనకల్లు : వరిపైరును పరిశీలిస్తున్న ఏవో, ఏఈవోలు


బోనకల్లులో గాలివానకు నేలకొరిగిన మిర్చిపైరు


ముదిగొండ : పత్తి పంటను పరిశీలిస్తున్న అధికారులు


ఖమ్మం రూరల్ : నీట మునిగిన వరిపంట


చింతకాని : సీతంపేటలో నీటమునిగిన వరిపైరు

## నేడు మండల సర్వసభ్య సమావేశం

కూసుమంచి, డిసెంబర్ 6: కూసుమంచి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం ఎంపీపీ బానోత్ శ్రీనివాస్ అధ్యక్షతన కార్యాలయంలో జరుగనున్నదని ఎంపీడీవో రమాదేవి తెలిపారు. ఉదయం 11 గంటలకు జరిగే సర్వసభ్య సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

## వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

ముదిగొండ, డిసెంబర్ 6: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి మాలతి అన్నారు. బుధవారం ఆమె ముదిగొండ, వల్లభి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించారు. విష జ్వరాలు విజృంబించే ప్రమాదం ఉన్నందున జాగ్రత్తగా ఉండాలని సూచించారు. వైద్యాధికారులు అరుణాదేవి, దర్మేంద్ర, సీహెచ్‌వో దుర్గా మల్లేశ్వరి, సిబ్బంది నాగమణి, కుమారి, అరుణ, సత్యవతి, వీరయ్య పాల్గొన్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి మాలతి

## మట్టిగోడ కూలి దంపతుల మృతి


గోడను పరిశీలిస్తున్న ఏసీపీ బస్వారెడ్డి, దయాకర్‌రెడ్డి

కూసుమంచి(నేలకొండపల్లి), డిసెంబర్ 6: తుపాన్ ప్రభావంతో గోడకూలి భార్యాభర్తలు మృతిచెందిన ఘటన నేలకొండపల్లి మండలం చెరువుమాధారంలో మంగళవారం అర్ధరాత్రి జరిగింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నూకతొట్టి పుల్లారావు (30), భార్య లక్ష్మి (25) కూలీ పనులు చేసుకొని జీవనం సాగిస్తున్నారు. తుపాన్ ప్రభావంతో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఇద్దరూ నిద్రిస్తుండగా మట్టితో నిర్మించిన గోడ కూలి వారిపై పడడంతో భార్యాభర్తలు అక్కడికక్కడే మృతిచెందారు. ఎస్సై సతీశ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### బాధిత కుటుంబాలకు పొంగులేటి ప్రగాఢ సంతాపం

గోడకూలి దంపతులు మృతిచెందినట్లు విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యులకు రూ.లక్ష ఆర్థిక సాయాన్ని అందజేశారు. దయాకర్‌రెడ్డితోపాటు నాయకులు శాఖమూరి రమేశ్, కనమర్లపుడి రాము, కొడాలి గోవిందరావు, సర్పంచ్ సుజాత, ఎంపీటీసీ పుష్పలత, నాయకులు కృష్ణారెడ్డి, రవి, చంద్రారెడ్డి, శ్రీనివాసరెడ్డి, రమేశ్ పాల్గొన్నారు. గోడకూలిన ఘటనాస్థలాన్ని ఖమ్మం రూరల్ ఏసీపీ బస్వారెడ్డి, సీఐ జితేందర్‌రెడ్డి పరిశీలించారు. ఘటన జరిగిన తీరును స్థానికులు, పోలీసులను అడిగి తెలుసుకున్నారు.

## మహనీయుడు బీఆర్ అంబేద్కర్


మధిర : అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న దృశ్యం


తిరుమలాయపాలెం : నివాళి అర్పిస్తున్న యువకులు

మధిర, డిసెంబర్ 6: రాజ్యాంగ నిర్మాత బీఆర్.అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకొని పట్టణంలోని బీఆర్.అంబేద్కర్ విగ్రహానికి పలు పార్టీల నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించి ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, సంఘ సేవకులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

తిరుమలాయపాలెం, డిసెంబర్ 6: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం అంబేద్కర్ వర్ధంతిని ప్రజలు జరుపుకున్నారు. తిరుమలాయపాలెం, మహ్మదాపురం, జల్లేపల్లి, సుబ్లేడు, పిండిప్రోలు, బీరోలు, బచ్చోడు గ్రామాల్లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, యువజన సంఘాల నేతలు పాల్గొన్నారు.